# సాక్షి
## చిత్తూరు

శనివారం । 25 । జనవరి । 2025






**'కుంకీ'లతో భీ'కరి' కట్టడి?**
కౌండిన్య అభయారణ్యం నుంచి బయటకు వస్తున్న గజరాజులను కుంకీ ఏనుగులతో కట్టడి చేసేందుకు యత్నిస్తున్నారు. - IIలో

**కక్షగట్టి..**
గంగవరం పంచాయతీ చిన్నూరులో రాజు కాలువను ఓ రియల్టర్ పూడ్చేయడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. - IIలో





**ప్రభుత్వ స్థలాలకు 'పచ్చ' రంగు!**
చిత్తూరు పాత బస్టాండ్‌కు ప్రహరీ కింద పెట్టిన రేకులకు పచ్చ రంగు వేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. - IIలో

## న్యూస్‌రీల్

### పాలిటెక్నిక్‌తో పక్కాగా ఉపాధి



బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

కుప్పంరూరల్ : పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి కాగానే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు వెతుక్కుకుంటూ వస్తాయని కుప్పం పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలికల పాఠశాలలో పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో పరిశ్రమలను అనుసంధానం చేస్తూ కోర్సులను బోధిస్తున్నామన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వెల్లడించారు. కుప్పం కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్, స్టడీ మెటీరియల్ సైతం అందిస్తున్నట్లు వివరించారు. పాలిసెట్–2025 ఎంట్రన్స్ ఎగ్జామ్‌ను పది పాసైన, పది పరీక్షలు రాసిన విద్యార్థులు రాయవచ్చునని సూచించారు. అనంతరం పాలిటెక్నిక్ ఎందుకు చదవాలి అనే అంశంపై తయారు చేసిన బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్‌బాబు, పాలిటెక్నిక్ అధ్యాపకులు రమేష్, హుస్సేన్ మియామి పాల్గొన్నారు.

### చిటిపిరాళ్ల హెల్త్ క్లినిక్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలం చిటిపిరాళ్లలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు చేపట్టిన వ్యాక్సినేషన్‌పై విచారించారు. టెలీ మెడిసిన్ విధానం ఎలా పనిచేస్తోందో ఆరా తీశారు. అలాగే హెల్త్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలపై స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ ప్రభావతి, డీఎంహెచ్ఓ సుధారాణి, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే ఆలయం శుద్ధి చేసి విశేషంగా ముస్తాబు చేశారు. రాహుకాల సమయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయకర్తలకు ఆలయ ఈఓ ఏకాంబరం తీర్థప్రసాదాలు అందజేశారు.

### బాలికలకు పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి

చిత్తూరు కలెక్టరేట్ : బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందించాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని గిరింపేట నగరపాలక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి పౌష్టికాహారం ముఖ్యమన్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని సూచించారు. బాలికలు తమ లక్ష్యాలను చేరుకునేందుకు తల్లిదండ్రులు సహకరించి ప్రోత్సహించాలని కోరారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ విజయ్‌శేఖర్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో పిల్లలు సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో మంచిని స్వీకరించి చెడును వదిలేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆడపిల్లని రక్షిద్దాం..ఆడపిల్లని చదివిద్దాం అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సమగ్రశిక్ష శాఖ జీసీడీఓ ఇంద్రాణి, దిశా ఎస్ఐ నాగసౌజన్య, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ వాసంతి పాల్గొన్నారు.



- లేని కులాలకు మద్యం దుకాణాలు
- రూ.2లక్షల రుసుముపై వెల్లువెత్తిన విమర్శలు
- ఇప్పటికే పూర్తయిన వైన్‌షాపుల కేటాయింపులు
- అత్యధిక జనాభా గల ప్రాంతాలకు లేని షాపులు
- కలెక్టర్‌తో గోడు వెళ్లబోసుకున్న కుల సంఘాల నేతలు
- 27న గెజిట్.. 5వరకు దరఖాస్తులు.. 7వ తేదీన లాటరీ

# గీత.. మారని రాత!

కల్లు గీత కార్మికుల తల రాతను మార్చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ఊదరగొట్టింది. సులభతరంగా పది శాతం మద్యం దుకాణాలు కేటాయిస్తామంటూ చిలక పలుకులు వల్లించింది. అతి తక్కువ రుసుముతోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని ఆశలు కల్పించింది. అయితే వాస్తవంలోకి వస్తే మీ రాత మారే పరిస్థితి ఏమాత్రం లేదంటూ చేతల ద్వారా స్పష్టంగా తెలియజేసింది. వైన్‌షాపుల కేటాయింపుల్లో పలు కులాలకు తీరని అన్యాయం చేసింది. శుక్రవారం కలెక్టరేట్‌లో పారదర్శకత పేరుతో చేపట్టిన లాటరీని ప్రహసనంగా మార్చేసింది. కుల సంఘాల నేతల అభ్యంతరాలను బేఖాతర్ చేసింది. తూతూమంత్రంగా కలెక్టర్‌తో హామీ ఇప్పించి సమస్యను పక్కదారి పట్టిస్తోంది.



కలెక్టర్ ఎదుట అభ్యంతరాలు లేవనెత్తుతున్న కుల సంఘాల నేతలు

చిత్తూరు అర్బన్ : జిల్లాలో అన్ రిజర్వుడు కేటగిరీ కింద మొత్తం 104 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అందులో పది శాతం.. అంటే 11 షాపులను కల్లు గీత కార్మికులకు కేటాయించాలి. కానీ, జిల్లాకు పది దుకాణాలే పరిమితం చేశారు. లైసెన్సు ఫీజు 50 శాతం తగ్గించినప్పటికీ, నాన్–రీఫండబుల్ కింద గీత కులాల వాళ్లు రూ.2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. దుకాణం రాకుంటే రూ.2 లక్షలు తిరిగి ఇవ్వరు. ఆర్థికంగా వెనుకబడ్డ గీత కులాలను ఇలా దోచుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే గీత కులాల వారికి ఈడిగ అంటూ అందులోనే గౌడ, గౌడ్, గాండ్ల పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఈ లెక్కన కల్లుగీతలోని గౌడ, గౌడ్, గౌండ్ల ఉప కులాల వాళ్లు ఏయే దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలో స్పష్టతలేదు. ఇక జిల్లాలో యాదమరి, ఐరాల, కార్వేటినగరం, రామకుప్పం, బంగారుపాళ్యం ప్రాంతాల్లో కల్లుగీత సామాజిక వర్గాల వారు అత్యధికంగా ఉన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో ఒక్కటంటే ఒక్క దుకాణం కూడా కేటాయించలేదు. మరి గీత కులాలకు న్యాయం ఎలా జరుగుతుంది అంటే అధికారుల వద్ద సమాధానంలేదు.

**ఎక్కడెక్కడ ఎవరికంటే..!**

మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికుల్లో ఏయే కులాలకు ఎక్కడ కేటాయించాలి. ఎక్కడ షాపులు ఏర్పాటు చేసుకోవాలి అనే అంశాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో లాటరీ నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ లాటరీ తీసి వైన్‌షాపుల కేటాయింపులు చేపట్టారు. అందులో భాగంగా కల్లుగీత కులాలకు రిజర్వు చేసిన పది దుకాణాల్లో ఈడిగ ఉప కులానికి ఎనిమిది కేటాయించారు. చిత్తూరు నగరంతో పాటు నగరి, పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీలు, చిత్తూరు రూరల్, గుడుపల్లె, వి.కోట మండలాల్లో మద్యం దుకాణాలను లాటరీ ద్వారా ఈడిగ సామాజికవర్గానికి దక్కాయి. పాలసముద్రం గౌడ, పెద్దపంజాణి గాండ్ల, వెదురుకుప్పంలో గౌడ్ కులాలకు ఒక్కో వైన్‌షాపు వచ్చింది. ఆయా ఉప కులాలకు కేటాయించిన దుకాణాలకు వాళ్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. జిల్లావ్యాప్తంగా ఎవరైనా, ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ, ఒకే వ్యక్తికి లాటరీలో ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు వస్తే, కేవలం ఒక్క షాపు మాత్రమే మంజూరు చేస్తారు. అయితే వైన్‌షాపుల కేటాయింపుపై కుల సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో లేని కులాలకు దుకాణాలు ఇవ్వడంపై మండిపడ్డారు. అధిక సంఖ్యలో గీత కార్మికులున్న చోట షాపు కేటాయించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నచ్చజెప్పారు.

**27 నుంచి దరఖాస్తులు**

ఈ నెల 27వ తేదీన గీత కార్మికుల కోటా మద్యం దుకాణాలకు కలెక్టర్ గెజిట్ విడుదల చేస్తారు. ఆ రోజు నుంచే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆఖరు గడువు. అదే నెల 7న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, 8వ తేదీ నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

**లేనివాళ్లకు ఎలా..?**



జిల్లాలో కల్లు గీత కింద ఉండేదంతా ఈడిగలే. అయితే షాపులు నాలుగు కులాలకు ఇచ్చినారు. లేనివాళ్లకు షాపులు ఇచ్చే బదులు, ఉండే కులాలకే ఇస్తే న్యాయం జరగతాది. అప్పుడే మేము ఎదిగేదానికి వీలుపడతాది. ఎలా పడితే అలా చేస్తే నిజంగా మాకు నష్టమే.

– కృష్ణమూర్తిగౌడ్, ఈడిగ సంఘ జిల్లా అధ్యక్షుడు

**ఇదేనా ఎదుగుదల..?**



అప్లికేషన్ ఫీజు రూ.50 వేలు పెట్టుంటే అందరూ దరఖాస్తులు వేసి ఉంటాము. రూ.2లక్షలు పెట్టి, షాపు రాకుంటే తిరిగివ్వము అంటున్నారు. యాదమరి, పూతలపట్టులో మా కులం వాళ్లు ఎక్కువగా ఉంటే, అక్కడ ఒక్క దుకాణం కూడా పెట్టలేదు. ఇట్లాగైతే మేము ఎలా ఎదిగినట్టు అవుతుంది.

– వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా గౌడ సంఘం

### ఆక్రమణలను ఉపేక్షించం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ భవానీ

వి.కోట : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని ఆర్‌డీఓ భవానీ హెచ్చరించారు. శుక్రవారం పలమనేరు రోడ్డులో వివాదాస్పద షాదీమహల్ స్థలాన్ని పరిశీలించారు. పకడ్బందీగా సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలోని నెర్నిపల్లె పంచాయతీ మిట్టూరు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య వివాదాస్పదంగా మారిన స్థలాన్ని ఆర్‌డీఓ పరిశీలించారు. భూమి రికార్డులను ఇరు వర్గాల వారు సమర్పించాలని సూచించారు. ఈ క్రమంలోనే రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులపై సమీక్షించారు. వాటిని తక్షణం పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. తహసీల్దార్ పార్వతి, ఆర్ఐ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### అలసత్వం వహిస్తే చర్యలు



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలను తీరుస్తారని ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారుల వద్దకు వస్తారని, ఆర్థికపరమైనవి మినహాయించి, ఇతర అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.

**ఉపాధి కూలీలకు మెరుగైన వసతులు**

జిల్లాలోని ఉపాధి కూలీలకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. జిల్లా సేవా సంఘం ఎస్సీ, ఎస్టీ ఉపాధి హామీ డైరీని ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు గుణశేఖర్, సభ్యులు అన్నామలై, మురుగేషన్, కిరణ్‌కుమార్, వాలే నాయక్ పాల్గొన్నారు.

## ముగిసిన 'నాక్' కమిటీ పర్యటన



ద్రవిడ వర్సిటీ అధికారులతో సమావేశమైన నాక్ కమిటీ

కుప్పం : ద్రవిడ విశ్వవిద్యాలయంలో మూడురోజులుగా నాక్ కమిటీ చేపట్టిన పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వర్సిటీలోని అన్ని విభాగాలను సందర్శించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను పరిశీలించారు. హాస్టళ్ల, క్రీడా మైదానాలు, ఆడిటోరియం, మూలికా వనం, జానపద మ్యూజియం, అతిథి గృహం, సెంట్రల్ లైబ్రరీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ను సందర్శించారు. వర్సిటీ ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, పూర్వ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. అలాగే వర్సిటీ దత్తత తీసుకున్న గ్రామాల్లో సైతం పర్యటించి, ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మేరకు బిర్లా గ్లోబల్ యూనివర్సిటీ మాజీ వీసీ, ఆచార్య ప్రేమందు పి. మాతూర్ చైర్మన్‌గా ఏడుగురు సభ్యులతో కూడిన బృందం తుది నివేదికను సిద్ధం చేసింది. ఈ క్రమంలోనే ద్రవిడ వర్సిటీకి నూతన గ్రేడ్‌ను త్వరలోనే ప్రకటించనుంది.

**'ఎ' గ్రేడు వచ్చేనా?**

ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల క్రితం నాక్ కమిటీ పర్యటించి 'బి' గ్రేడును జారీ చేసింది. 'ఏ' గ్రేడు లేకపోవడంతో దూర విద్య విభాగం సైతం మూతపడింది. దీంతో వర్సిటీకి వచ్చే నిధులు ఆగిపోయాయి. కనీసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సైతం ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు కేవలం రెగ్యులర్ ఉద్యోగుల జీతాలకు మాత్రమే సరిపోయేది. 'ఎ' గ్రేడు సాధిస్తేనే వర్సిటీ మనుగడ సాధ్యమని ఉన్నతాధికారులు పకడ్బందీగా కార్యాచరణ చేపట్టారు. అయితే ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఏ గ్రేడ్ సాధించడం కష్టమే అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజారోగ్య రక్షణే లక్ష్యం

- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజారోగ్య రక్షణే లక్ష్యమని, పేదకు సైతం మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తోందన్నారు. ఆ మేరకు సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలని, నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కోరారు. ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో ఓపీ రోగులకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసే ఆరోగ్య భద్రత కార్డులను వందశాతం రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. గర్భిణులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రసవం తర్వాత తల్లీబిడ్డల ఆరోగ్య స్థితిగతులను ఆశ, ఏఎన్ఎంలు పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో చిన్నపాటి మరమ్మతులను ప్రత్యేక డ్రైవ్ పెట్టి పూర్తి చేసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా మందులను నిల్వ చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లో పరికరాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని చెప్పారు. బయో మెడికల్ వేస్ట్‌ను పక్కాగా సేకరించి డిస్పోజ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ జిల్లాలో 459 మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు (ఎంఎల్‌హెచ్‌పీస్), 540 ఏఎన్ఎంలు, 1526 ఆశా వర్కర్లు ఉన్నారన్నారు. 76,629 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 3,500 మందికి కంటి సమస్యలున్నట్లు గుర్తించి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, దోమల నిర్మూలనకు అవసరమైన చర్యలను చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లాలో 14 నవంబర్ 2024 నుంచి 15 జనవరి 2025 వరకు 612 సచివాలయాల పరిధిలో 84,579 గృహాల్లో సర్వే నిర్వహించమని వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్ఓ సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, పీఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ కో–ఆర్డినేటర్ సుదర్శన్, డీఐఓ హనుమంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వీరపాండ్యన్, పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

## తాగు నీటికి అధిక ప్రాధాన్యం



పచ్చికాపల్లంలో వర్మీ కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సుధాకరరావు

వెదురుకుప్పం : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పంలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ట్యాంకులను శుభ్రంగా ఉంచుకుని ప్రజలకు సురక్షిత నీటిని అందించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లతో చర్చించి అవసరమైన నిర్ణయాలను తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యాలయ నిర్వహణ, స్వర్ణ పంచాయతీ అసైన్‌మెంట్ ఎంట్రీ విధానాలకు సంబంధించి పలు సూచనలు అందించారు. ఈ క్రమంలోనే పచ్చికాపల్లం, కొమరగుంట పంచాయతీల్లోని వర్మీకంపోస్టు యార్డులు పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ మార్చి31వ తేదీలోపు ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అమర్‌నాథ్, ఈఓపీఆర్‌డీ పురుషోత్తం, ఏఓ నాగరాణి పాల్గొన్నారు.

## విద్యతోనే మహిళా సాధికారిత



విజేతలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న అతిథులు

పలమనేరు : విద్యతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాధ తెలిపారు. మహిళా సాధికారితపై పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్ర వారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రాధ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళలు మరింత ముందుకెళ్లాలని, అలాగే విద్యార్థినులు సైతం సరికొత్త ఆలోచనలతో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ కేశవ మాట్లాడుతూ మన దేశంలో మహిళా సాధికారిత..విదేశాల్లో సాధికారత అనే అంశాలను వివరించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా సాధికారిత అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సునీలాశ్యామ్, గీతాంజలి, కల్పన కృష్ణయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు

### పర్యాటక దినోత్సవ ర్యాలీ

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరులో శనివారం పర్యాటక దినోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ జిల్లా అధికారి మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా చిత్తూరులోని పీసీఆర్ పాఠశాల నుంచి ర్యాలీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను చాటేలా ర్యాలీ సాగుతుందని వివరించారు. విద్యార్థుల్లో పర్యాటక శాఖపై అవగాహన సైతం కల్పించనున్నట్లు తెలిపారు.

### ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్షపై విశ్వంలో ఉచిత అవగాహన సదస్సు

**తిరుపతి ఎడ్యుకేషన్:** తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో ఆదివారం ఉదయం 10.00 గంటలకు డెహ్రాడూన్‌లోని 'రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ'(ఆర్ఐఎంసీ) ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు నిర్వాహిస్తున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవగాహన సదస్సుకు 7, 8వ తరగతులు చదువుతున్న విద్యార్థులు, వారి తలిదండ్రులు పాల్గొని ప్రవేశ పరీక్ష వివరాలు, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలో సీట్లు పొందడానికి మెళకువలను కూడా వివరిస్తారని తెలిపారు. దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 31వ తేదీ చివరి రోజని వివరించారు. మరిన్ని వివరాలకు 8688888802 / 9399976999 నంబర్లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్‌కు జైలు

**చిత్తూరు అర్బన్:** నిర్లక్ష్యంగా బస్సు నడిపి, ఒకరి మృతికి కారణమైన గంభీరం (55) అనే ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ చిత్తూరు ప్రత్యేక సంచార న్యాయస్థానం మేజిస్ట్రేట్ వెన్నెల శుక్రవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం గడ్డంపల్లె గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి (52) 2021 ఆగస్టు 19వ తేదీన తన ద్విచక్రవాహనం వెళుతుండగా, అదే మండలం అప్పిరెడ్డి కండ్రిగ వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యంరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఆర్టీసీ బస్సు నడిపిన గంభీరాన్ని కోర్టుకు తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే స్కూటరిస్టు మృతి చెందినట్లు నిరూపణ కావడంతో, నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

# కుంకీలతో భీకరి కట్టడి?

కౌండిన్య అభయారణ్య సమీపంలోని పల్లె వాసులను దశాబ్దాలుగా ఏనుగుల సమస్య వేధిస్తోంది. అడవిని దాటి వస్తున్న గజరాజులు పంటలను నాశనం చేస్తుండడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. భీకరి₹ కట్టడికి అటవీశాఖ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ నిరుపయోగంగా మారిపోతోంది. కందకాలు సైతం ఫలితం ఇవ్వని పరిస్థితి తలెత్తింది. కర్ణాటక తరహాలో చేపట్టిన హ్యాంగింగ్ సిస్టమ్ కూడా ప్రయోగంగానే మిగిలిపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా గజబీభత్సానికి చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు పలమనేరు మండలం మొసలిమడుగు వద్ద ఎలిఫెంట్ ప్రాజెక్టు చేపడుతోంది. అయితే రామకుప్పం మండలం ననియాలలో ఇదే విధంగా గతంలో ఏర్పాటు చేసిన క్యాంపు ఓ వైఫల్యంగా నిలిచిపోయింది. అందులోని కుంకీ కనీసం ఒక్క ఏనుగును కూడా అదుపు చేయలేని దుస్థితి ప్రత్యక్ష నిదర్శనంగా మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఆదే పునరావృతమవుతుందేమో అనే అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది.

- గతంలో పనిచేయని 'కుంకీ' ప్రయోగం
- విఫలమైన ననియాల ఎలిఫెంట్ క్యాంప్
- పలమనేరు సమీపంలో మరో శిబిరం కోసం ఏర్పాట్లు
- ట్రెంచ్‌లు.. సోలార్ ఫెన్సింగ్‌లు వృథాగా మారే అవకాశం
- శిక్షణ పొందిన కర్ణాటక గజరాజుల రాకపై అయోమయం
- కౌండిన్యలో మూడు దశాబ్దాలుగా తీరని ఏనుగుల సమస్య



మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపునకు వస్తాయంటున్న కుంకీ ఏనుగులివే..



కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన గుంత



ఫలితం ఇవ్వని ఎలిఫెంట్ ట్రెంచ్



కౌండిన్యలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)



గతంలో నాసిరకంగా నిర్మించిన సోలార్ ఫెన్సింగ్

**పలమనేరు :** కుప్పం, పలమనేరు పరిధిలోని కౌండిన్య అభయారణ్యం 250 కిలోమీటర్ల మేర మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో సుమారు 120 ఏనుగులుఉన్నాయి. 1984లో మొసలిమడుగు వద్ద కౌండిన్య ఎలిఫెంట్ సంరక్షణ కేంద్ర ఏర్పాటు చేశారు. ఇందులోకి మోర్ధన ఫారెస్ట్‌తోపాటు కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని కృష్ణగిరి, హోసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే గజరాజులు అడవిని దాటి బయటకు రాకుండా ఉండేందుకు బంగారుపాళ్యం మండలం నుంచి కుప్పం వరకు 142 కిలోమీటర్ల మేర సోలార్‌ఫెన్సింగ్, 40 కిలోమీటర్ల మేర ట్రెంచ్‌లు రూ.2.61కోట్లతో గప ర్పాటు చేశారు.

### గతంలో చేపట్టిన పనులు విఫలం

సోలార్‌ఫెన్సింగ్‌ను ఏనుగులు తొక్కి అడవిలోంచి బయటకు వస్తున్నాయి. ఎందుకంటే ఫెన్సింగ్ కోసం ఏర్పాటు చేసిన కమ్మీలు నాసిరకంగా ఉండడంతో వీటిని సులభంగా విరిచేస్తున్నాయి. దీనికి తోడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సోలార్‌కు బ్యాటరీలు పనిచేయక చాలాచోట్ల కరెంట్ షాక్ కొట్టడం లేదు. ఇక ఎలిఫెంట్ ట్రెంచ్‌లను సైతం ఏనుగులు మట్టిని తోసి బయటికొస్తున్నాయి. ఈ రెండు ఫెయిల్ కావడంతో గత ఏడాది కర్ణాటక మోడల్ పేరిట హ్యాంగింగ్ సోలార్‌ను పది కిలోమీటర్ల మేర ప్రయోగాత్మకంగా చేపట్టి ఆపై అలాగే వదిలేశారు.

### కర్ణాటక నుంచి కుంకీలు!

కూటమి ప్రభుత్వం కర్ణాటక సర్కారుతో ఎంఓయూ చేసుకొని అక్కడ శిక్షణపొందిన నాలుగు కుంకీ ఏనుగులకు ఇక్కడికి తెప్పిస్తామంటోంది. ఇందుకోసం రేంజి పరిధిలోని 20మంది ఎలిఫెంట్ ట్రాకర్లను దుబారే ఎలిఫెంట్ క్యాంపునకు పంపి నెలరోజుల పాటు శిక్షణ ఇప్పించింది. ఆమేరకు పలమనేరు మండలంలోని ముసలిమొడుగు వద్ద రూ.12లక్షల వ్యయంతో కుంకీ ఎలిఫెంట్ క్యాంపును 50 ఎకరాల్లో ఏర్పాటు చేస్తోంది. వీటికోసం పనిచేసే మహోత్సవ్, వావడిల నివాసాలు నిర్మించాలని నిర్ణయించింది. మరో రూ.27లక్షలతో హ్యాంగింగ్ సోలార్‌ను ఏర్పాటు చేయనుంది. ఇదిలా ఉండగా, గతంతో రామకుప్పం వద్ద ననియాలలో ఏర్పాటు చేసిన ఇలాంటి క్యాంపులో రెండు ఏనుగులున్నాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు వెళుతున్నారేగానీ ఇవి అడవిలోని ఏనుగులను కట్టడి చేసిన దాఖలాలు ఇప్పటిదాకా లేవు. అదే రీతిలో ఇక్కడ కుంకీలతో సమస్య తెగుతుందా? లేదా అనే సందేహం మాత్రం ఇక్కడి రైతులకు పట్టుకుంది. అసలే ఇక్కడున్న మదపుటేనుగులు తమ ఎదుట పడిన కుంకీ ఏనుగులపై దాడులు చేసే అవకాశం లేకపోలేదు.

### కట్టడి సాధ్యమే



పలమనేరులో కుంకీ ఎలిఫెంట్ క్యాంపు కోసం ఇప్పటికే పనులు సాగుతున్నాయి. ఆ మేరకు మైసూరు సమీపంలోని దుబారే నుంచి నాలుగు కుంకీ ఏనుగులు త్వరలో రానున్నాయి. ఎలిఫెంట్ ట్రాకర్లకు ఇప్పటికే కుంకీ ట్రెనింగ్ ఇప్పించాం. ముఖ్యంగా మదపుటేనుగులు దాడులు చేయకుండా వాటికి శిక్షణనిస్తాం. దీంతో ఏనుగులను కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

**- భరణి, డీఎఫ్ఓ, చిత్తూరు**

### సమస్య తీరితే చాలు



గతంలో ఏనుగులను కట్టడి చేసేందుకు చేసిన పనులన్నీ లాభం లేకుండా పోయాయి. ఇప్పుడు కుంకీ ఏనుగులంటున్నారు. వీటితోనైనా ఇక్కడ ఏనుగుల సమస్య పరిష్కారమైతే అదే పదివేలు. అయినా జనంపై దాడులు చేస్తూ, పంటపొలాలపై పడుతున్న మదపుటేనుగులను ఈ కుంకీలు ఎంతవరకు అదుపు చేస్తాయనే అనుమానం కూడా ఉంది.

**- ఉమాపతి, రైతు సంఘం నేత, పలమనేరు**

## కాలుదువ్విన కోడెగిత్తలు



తవణంపల్లె మండలం ఈచనేరిలో శుక్రవారం పరుష పందేలు నిర్వహించారు. సుమారు 86 ఎద్దులను బరిలో దింపారు. పరుగులు తీస్తున్న పశువులను నిలువరించేందుకు యువకులు ఉత్సాహంగా ముందుకు ఉరికారు. పలకలు దక్కించుకునేందుకు హోరాహోరీగా పోటీపడ్డారు. విజేతలుగా నిలిచిన వారు విజయ గర్వంతో కేరింతలు కొట్టారు. ఈ క్రమంలోనే బంగారుపాళ్యానికి చెందిన ఓ ఎద్దు జనాలపైకి దూకుతూ ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని కింద పడిపోయింది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృత్యువాత పడింది. ఈ పోటీల్లో బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్లకు చెందిన ఎద్దు రూ.50 బహుమతి కైవసం చేసుకుంది. పలమనేరు మండలం బండమీద జొక్కావారిపల్లెకు చెందిన ఎద్దు రూ.30 వేలతో రెండోస్థానంలో నిలిచింది. పలమనేరు చెందిన ఎద్దు రూ.15 వేలతో మూడో బహుమతి దక్కించుకుంది. - తవణంపల్లె





### 40 లీటర్ల సారా పట్టివేత



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**కార్వేటినగరం :** శ్రీరంగ రాజపురం మండలంలోని చిన్న తయ్యూరు, ఎల్లం పల్లెలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ సారా తయారీపై సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు చేపట్టామన్నారు. ఈ మేరకు సారా సీజ్ చేశామని, 12 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని వెల్లడించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మునిసుందరం, సిబ్బంది రామచంద్రయ్య, సురేంద్రబాబు, విజయ్‌కుమార్, గీత పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పలమనేరు :** పట్టణంలోని పద్మశ్రీ వెనుక మదనపల్లె రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. స్థానిక రఘువీరారెడ్డి కాలనీకి చెందిన మొగిలప్ప(70) ద్విచక్రవాహనంపై వెళతుండగా ఆటో ఢీకొంది. దీంతో ఆయన కింద పడగా, పక్కనే ట్రాక్టర్ ట్రాలీకి తలకు తగిలింది. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం చిత్తూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యంలో మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ స్థలాలకు 'పచ్చ' రంగు!



పాత బస్టాండు వద్ద ఏర్పాటుచేసిన పచ్చ రంగు రేకులు

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు ప్రస్తుతం పచ్చ రంగులతో నిండిపోయింది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ భవనాలపై శుభాకాంక్షల బోర్డులు రాయించారు. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండు (పాత బస్టాండు) చుట్టూ పచ్చ రంగులతో ఏర్పాటు చేసిన రేకులు పెట్టేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ప్రహరీ ఏర్పాటు చేయడం సబబే కానీ, ఇలా ఓ పార్టీకి చెందిన రంగులు పులమడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ షీట్లు ఏర్పాటు చేస్తున్న విషయం కార్పొరేషన్ అధికారులకు తెలియకపోవడం, టెండర్లు కూడా పిలవకపోవడం కొసమెరుపు.

# కక్షగట్టి.. కాలువ పూడ్చేసి!

ఓ రియల్టర్ కక్ష సాధింపునకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కాలువను పూడ్చేయడంతో గ్రామస్తులు సైతం అవస్థలు ఎదుర్కొంటున్నారు. కబ్జాదారు వికృత పోకడలకు పాఠశాల చుట్టూ మురుగు చేరుతోంది. భరించలేని దుర్వాసనతో పిల్లలు ఊపిరి తీసుకునేందుకు సైతం ఇక్కట్లు పడే దుస్థితి దాపురించింది. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది. కూటమి నేతల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కుడికి పరోక్షంగా సహకరిస్తోంది.

- కూటమి నేతల అండతో ఓ రియల్టర్ ఓవరాక్షన్
- పాఠశాల ప్రాంగణంలోకి చేరుతున్న మురుగు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాల దగ్గర చేరిన మురుగు నీరు

**గంగవరం:** గంగవరం పంచాయతీ చిన్నూరులో దాదాపు 200 కుటుంబాలున్నాయి. గ్రామంలోని రాజు కాలువ ద్వారా మురుగు వెళుతుంది. అయితే ప్రస్తుతం అది తన భూమిలో ఉందని ఓ రియల్టర్ సదరు కాలువను మట్టితో పూడ్చేశాడు. దీంతో మురుగు నీరు ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి చేరుతోంది. ఫలితంగా దుర్వాసన నడుమ పిల్లలు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాగే మరికొన్ని రోజులు గడిస్తే ఇదే మురుగు మడుగులా తయారై రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వం మారగానే..

2014లో టీడీపీ ప్రభుత్వంలో ఈ గ్రామానికి ఇదే దుస్థితి దాపురించింది. అప్పట్లో కూడా ఈ రియల్టర్ వికృత చేష్టకు పిల్లలు, పెద్దలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కాలువను పూడ్చేయడంతో మురుగంతా పాఠశాల ఆవరణలోకి చేరి విద్యార్థులు రోగాల బారిన పడ్డారు. పలువురు ప్రాణాలు సైతం కోల్పోయారు. అయినప్పటికీ నాటి ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. దీనిపై గ్రామస్తులు పోరాటం సాగించినా ఫలితం లేకుండా పోయింది. తర్వాత 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో రూ.4లక్షల పంచాయతీ నిధులు వెచ్చించి కాలువను పునర్నిర్మించారు. దీంతో సమస్య పరిష్కారమైంది. అయితే కూటమి ప్రభుత్వం రాగానే సదరు రియల్టర్ మళ్లీ కాలువను పూడ్చేశాడు. దీంతో గ్రామస్తులు ఏం చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్నారు.

### దారి వదల్లేదని ప్రతీకారమా?

గ్రామ సమీపంలో తాను వేసిన వెంచర్‌కు పాఠశాల మధ్య నుంచి దారి ఏర్పాటు చేసుకునేందుకు రియల్టర్ ప్లాన్ వేశాడు. అందుకు స్థానికులు అంగీకరిచకపోవడంతో కక్షగట్టి కాలువను పూడ్చేశాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఆ రియల్టర్‌కు అండగా నిలబడినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. పూర్వీకుల కాలం నుంచి ఉన్న రాజు కాలువను తన భూమిలో ఉందని చెప్పడం ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.